క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం



ధ్వజావరోహణం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: టీటీడీకి అనుబంధంగా ఉన్న చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ఉదయం త్రిశూల స్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో పరిసమాప్తమైంది. ఉదయం నిత్యపూజాది కార్యక్రమాలను పూర్తిచేసిన అర్చకులు ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం చేశారు. గంగాళంలోని జలంలో త్రిశూల స్నానం చేయించి, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలు, నైవేద్య సమర్పణ అనంతరం ధ్వజస్తంభం నుంచి నందీశ్వరుని చిత్రపటమున్న వస్త్రాన్ని అవరోహణం చేయించారు. ఉత్సవాలను నిర్వహించిన అర్చకులను బహుమానంతో సత్కరించారు. కార్యక్రమాలను స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జిత అధికారి భరత్ పర్యవేక్షించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సాదర వీడ్కోలు



సీఎస్‌కు జ్ఞాపిక అందించి వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్

రేణిగుంట: రెండు రోజుల తిరుమల, తిరుపతి పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం తిరుగు పయనమైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. ఆయనకు విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, టీటీడీ జేఈఓ గౌతమి, జిల్లా జేసీ ధ్యానచంద్ర, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ వీడ్కోలు పలికారు. కలెక్టర్ వెంకటేశ్వర్, సీఎస్ దంపతులకు శ్రీవేంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేశారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ఏర్పేడు: మండలంలోని మూలకండ్రిగలో ఓ బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని పలు ప్రజాసంఘాల నాయకులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూలకండ్రిగ గ్రామానికి చెందిన బలరామయ్య ఈనెల 7న ఓ బాలిక(6)పై అత్యాచారం చేసినట్లు చెప్పారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ప్రజాసంఘాల నేతలు కలపాటి గురవమ్మ, వాసుదేవులు, గాలి రవి, నారాయణ, హరిబాబు, జయచంద్ర పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన రాజారెడ్డి

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పదో మైలు గ్రామ సమీపంలోని కేటీ రోడ్డు మలుపు వద్ద ద్విచక్ర వాహనం బోల్తా పడడంతో తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గ్రామానికి చెందిన రాజారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. బుచ్చినాయుడుకండ్రిగ నుంచి శ్రీకాళహస్తికి వెళుతుండగా మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రగాయాలపాలైన రాజారెడ్డిని పోలీసులు శ్రీకాళహస్తిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పోస్టర్ పెయింటింగ్‌లో ప్రథమ స్థానం

నగరి : వే ఫౌండేషన్, రీజినల్ సైన్స్‌సెంటర్ తిరుపతి వారు సంయుక్తంగా నిర్వహించిన పోస్టర్ పెయింటింగ్ పోటీలో నగరి విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం పొందినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి రీజినల్ సైన్స్ సెంటర్‌లో ఆదివారం కొత్త వెబ్‌సైట్ లాంచింగ్‌లో భాగంగా మొక్కల పెంపకం దాని సవాళ్లు అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలో నగరి మున్సిపల్ పరిధి పుదుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కేఎల్ సంధ్య, ఎస్‌జీ లతిక పోస్టర్ పెయింటింగ్ చేశారు. విద్యార్థుల పెయింటింగ్‌కు ప్రథమ బహుమతి లభించింది. విద్యార్థులకు, గైడ్ టీచర్‌కు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

వర్షాకాలం.. పశువులు జరభద్రం

- పశుపోషణలో జాగ్రత్తలు పాటించండి
- వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు
- జాగ్రత్తలు వహించాలంటున్న పశువైద్యురాలు శిల్పారెడ్డి



పొలాల్లో మేత మేస్తున్న పశువులు

ఏర్పేడు: ప్రస్తుతం వర్షాకాలంలో పశువులు వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువ. ఈ సమయంలో పాడిరైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ సీజనల్‌లో వచ్చే వ్యాధులు సాధారణమైనవే అయినా పాడిపై తీవ్రప్రభావం చూపుతాయి. పాడిరైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా వాటి ప్రాణాలకే ప్రమాదం వాటిల్లవచ్చు. జీవాలు ప్రమాదకర పరిస్థితుల్లో ఉంటే 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే సంచార పశుఆరోగ్యసేవా వాహనంతో వైద్యులే ఇంటికి వచ్చి మరీ చికిత్స అందిస్తారు. పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏర్పేడు పశువైద్యురాలు శిల్పారెడ్డి సూచనలు..

పోషణ..

ఈ సీజన్‌లో పశువులకు మేతగా మేలురకం జాతి గడ్డిని ఇవ్వడం వల్ల విటమిన్–ఏ మినరల్స్ సమకూరుతాయి. మేలురకం గడ్డి ద్వారా పాల దిగుబడి పెరగడంతో పాటు చూడి కట్టే శాతం మెరుగు పడనుంది. పశువు బరువును బట్టి రైతులు రోజూ 20 కిలోల నుంచి 40 కిలోల వరకు పచ్చగడ్డి, 3 నుంచి 4కిలోల వరకు ఎండుగడ్డిని మేతగా ఇవ్వాలి. పరిశుభ్రమైన నీరు 60 నుంచి 70 లీటర్లు తాపాలి. దీంతో పశువులకు మంచి ఆరోగ్యం కలుగుతుంది.

గొంతువాపుతో జాగ్రత్త..

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రాణాంతకమైంది. ఈ వ్యాధి బారిన పడిన పశువులకు కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి చొంగకారుతుంది. శ్వాస పీల్చడానికి ఇబ్బంది పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతువాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు మృతిచెందే ప్రమాదం ఉంది. వ్యాధి నియంత్రణ కోసం హెచ్ఎస్ టీకాలు వేస్తారు. వ్యాధి బారిన పడిన పశువులను మంద నుంచి వేరు చేయాలి.

చిటుక వ్యాధి..

వర్షాకాలంలో గొర్రెలు, మేకలు, పశువులకు ఎక్కువ వచ్చే వ్యాధుల్లో చిటుక ఒకటి. ఈ వ్యాధి సోకినప్పుడు జ్వరం ఎక్కువగా ఉంటుంది. నివారణ కోసం ఈటీ వ్యాక్సిన్ వేస్తారు. రైతులు వ్యాధులను సకాలంలో గుర్తించి వైద్యం అందించడం ద్వారా వాటిని నివారించవచ్చు.

గాలికుంటు వ్యాధి..

గాలికుంటు వ్యాధి ఆవులు, ఎద్దులు, గేదెలకు ఎక్కువగా సోకుతాయి. వ్యాధి బారిన పడిన పశువు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీలకు పెరుగుతుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సక్రమంగా తీసుకోలేవు. నీరసంగా మారి నడిచేందుకు కష్టపడతాయి. పాడి పశువుల్లో అయితే పాలఉత్పత్తి గణనీయంగా పడిపోతుంది. వ్యాధి నివారణ కోసం వైద్యుల సూచనల మేరకు యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందులు వాడాలి. గొర్రెల్లో నీలి నాలుక వ్యాధి కారణంగా కాళ్లగిట్టల పైభాగం ఎరుపు రంగుగా మారే పరిస్థితి ఉంటుంది. దీంతో జ్వరం బారినపడి నాలుక నీలంగా మారడంతో మృతిచెందే ప్రమాదం ఉంటుంది. ఈ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు బ్లూటంగ్ వ్యాక్సిన్ వేస్తారు. ఆవు జాతి పశువుల్లో లంపీస్కిన్ వ్యాధి సోకే పరిస్థితి ఏర్పడుతుంది. శరీరంపై దుద్దర్లతో కూడిన పుండ్లు, అధిక ఉష్ణోగ్రతతో కూడిన జ్వరం, తీవ్ర కాళ్ల నొప్పుల బారిన పడి మృతిచెందే అవకాశం ఉంది. ఈ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ముందస్తుగా లంపీస్కిన్ వ్యాక్సిన్‌ను వేస్తారు. వర్షాకాలం నేపథ్యంలో పశువులను పాకల్లో నీటినిల్వతో పాటు తడి ఉన్న ప్రాంతాల్లో ఉంచరాదు. పొడిగా ఉన్న ప్రదేశాల్లో ఉంచడం మంచిది.

అప్రమత్తంగా ఉండాలి



పశువుల అనారోగ్యాన్ని గుర్తించిన వెంటనే సమీపంలోని పశువైద్యులను సంప్రదించాలి. ఇప్పటికే పలు వ్యాధులు సోకకుండా వ్యాక్సిన్‌లు ముందస్తుగా వేశాం. ఏదైనా వ్యాక్సిన్ వేయిస్తే దాని ప్రభావం ఆరు నెలల వరకు ఉంటుంది. పశుసంరక్షణపై ఎలాంటి సందేహాలున్నా పాడి రైతులు పశువైద్యులను సంప్రదించాలి. – శిల్పారెడ్డి, పశువైద్యురాలు, ఏర్పేడు మండలం

వన భోజనాల కోవెల



ఆలయ పరిసరాల్లో చెట్లు

సత్యవేడు: సత్యవేడు– తమిళనాడు సరిహద్దుల్లోని సదవాలమ్మ శక్తి ఆలయం(కోవెల) వన భోజనాలకు విడిదిగా మారింది. అమ్మవారి మొక్కుల పేరుతో ప్రతి బుధ, ఆదివారాలు ఇక్కడ మేకపోతులు, పొట్టేళ్లు, కోడి పొంగళ్లు వనభోజనాలతో పండుగ వాతావరణం అలముకుంటుంది. సత్యవేడు పరిసర ప్రజలకు అత్యంత ఆరాధ్య దైవంగా సదవాలమ్మ ఉంటోంది. అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించి అందరికీ భోజనాలు పెడితే మేలు జరుగుతుందని ఈ ప్రాంతవాసుల నమ్మకం. ఇక్కడ చెట్లు చల్లదనం ఉండడం కూడా వన భోజనాలకు అనువుగా ఉంది.



సదవాలమ్మ ఆలయంలో ప్రతిష్ఠించిన శక్తి దేవతలు

శ్రీవారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవారు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో వెలసిన శ్రీసర్వమంగళ సమేత శ్రీపల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీవారాహి అమ్మవారికి విశేష పూజలు చేపట్టారు. ఆషాడ నవరాత్రులు సందర్భంగా విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 9వ రోజు శ్రీవారాహి అమ్మవారికి పంచామృతంతో విశేష అభిషేకం నిర్వహించి, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రారెడ్డి పూజలో పాల్గొన్న భక్తులకు దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కార్తికేయన్, సతీష్ శర్మ, గణేష్ శర్మ, ఆలయ సిబ్బంది శరవణ, పరంధామరెడ్డి పాల్గొన్నారు.

శిథిలావస్థలో బస్ షెల్టర్లు

– వేచివుండాలంటే తప్పని ఇక్కట్లు



హౌసింగ్ సొసైటీ కాలనీ వద్ద శిథిలావస్థలో బస్ షెల్టర్

శ్రీకాళహస్తి రూరల్: తిరుపతి –శ్రీకాళహస్తి ప్రధాన రహదారిలోని బస్ షెల్టర్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం లక్షలు వెచ్చించి నిర్మించిన బస్ షెల్టర్లు ప్రస్తుతం ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారాయి. శ్రీకాళహస్తి మండలంలోని హౌసింగ్ సొసైటీ కాలనీ వద్ద ఉన్న బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరింది. తొండమనాడు ప్రధాన రహదారిపై ఉన్న బస్సు షెల్టర్ నిరుపయోగంగా మారి ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారింది. వాన, ఎండ తాకిడికి గురికాకుండా బస్ సర్వీసు కోసం ప్రయాణికులు వేచి ఉండేందుకు నిర్మించిన బస్‌షెల్టర్లను మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో ప్రస్తుతం నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. నిరుపయోగంగా ఉన్న బస్సు షెల్టర్లు మరమ్మతులు చేసి ప్రయాణికులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏంతైనా ఉంది.



తొండమనాడు వద్ద ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారిన బస్ షెల్టర్

భక్తిశ్రద్ధలతో వారాహి నవరాత్రి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వారాహి అమ్మవారు, శ్రీచక్రయంత్ర మహా మేరువు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని వ్యూహలక్ష్మీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వారాహి అమ్మవారి నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం 9వ రోజు నవమి సందర్భంగా ఆలయం వద్ద వారాహి అమ్మవారితో పాటు శ్రీచక్ర యంత్ర మహా మేరువుకు పంచామృత అభిషేకాలు చేశారు. మూలమంత్రం, లక్ష్మీ సహస్ర నామ కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్ స్వామి మాట్లాడుతూ కాశీ గ్రామ దేవతగా పిలువబడే వారాహి అ మ్మవారికి 9 రోజు లు గుప్త నవరాత్రుల పేరిట ఉత్సవాలను జరుపుకో వడం సంతోషంగా ఉందన్నారు. సోమవారం రాత్రి ఉత్సవాలు ముగింపు పూజలు చేస్తామని పేర్కొన్నారు.



వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కండలేరులో 6.303 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 6.303 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరదకాలువ నుంచి కండలేరు జలాశయానికి 80 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. అలాగే హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కనీస వేతనాలివ్వాల్సిందే!

- కార్మికశాఖ ఉప కమిషనర్ బాలునాయక్

సాక్షి ఎఫెక్ట్..

రేణిగుంట: 'కబళిస్తున్న కాలుష్యం– ప్రాణాలకు లేదు అభయం' పేరిట ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలను చెల్లించి వారికి ఉద్యోగ భద్రత, భరోసా కల్పించాల్సిన బాధ్యత ఆయా కంపెనీల యాజమాన్యాలకు ఉందని కార్మికశాఖ తిరుపతి ఉప కమిషనర్ బాలునాయక్ స్పష్టం చేశారు. ఆయన ఆదివారం సాక్షితో మాట్లాడుతూ జిల్లాలోని పలు పరిశ్రమలు, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు వారి పనిని బట్టి కనీస వేతనాలను చెల్లించాలన్నారు. స్థానికులైనా, బయట రాష్ట్రాలకు చెందిన వారైనా వేతనాల విషయంలో వ్యత్యాసాలుంటే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒక్క రోజులో 8గంటల కంటే ఎక్కువగా పనిచేయించుకున్నా చర్యలు తప్పవన్నారు. జిల్లాలోని పలుచోట్ల తనిఖీలు చేసి కార్మికుల భద్రతకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికులు తమకు నేరుగా ఫిర్యాదు చేస్తే ఆ కంపెనీ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ఐదుగురు విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతిలో ఉత్తీర్ణులైన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు జయసుధ తెలిపారు. వారు నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, పీడీ రమణ ఆదివారం అభినందించారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

ఏర్పేడు: మండలంలోని పెన్నగడం ఎస్టీ కాలనీలో ఆత్మహత్యకు యత్నించి తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం మృతిచెందాడని ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు తెలిపారు. పెన్నగడం ఎస్టీ కాలనీకి చెందిన వినోద్(25) పిల్లలు లేరని మనస్తాపం చెంది శనివారం విషపు గుళికలను మింగినట్లు వివరించారు. కుటుంబసభ్యులు గుర్తించి చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించినట్లు పేర్కొన్నారు. రుయాలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు సీఐ చెప్పారు.

వీసీలను త్వరగా నియమించండి

తిరుపతి సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాలలో పాలన కుంటుపడిందని వీసీల నియామకం త్వరగా చేపట్టాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.నారాయణ గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దాదాపు నెల రోజుల నుంచి వర్సిటీలలో రిజిస్ట్రార్‌లు, వీసీలు లేని కారణంగా యూఆర్‌సీ, పీహెచ్‌డీ వైవా జరగలేదని, దీంతో ఎంతో మంది విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి ఈ విషయంపై తక్షణం స్పందించి వర్సిటీలకు వీసీలను నియమించాలని కోరారు.

చినుకు పడితే చిత్తడే!



ఏర్పేడులో గుంతలమయంగా రోడ్డు

ఏర్పేడు: చినుకుపడితే స్థానిక కూడలి చిత్తడిగా మారి ప్రజలను ఇబ్బంది పెడుతోంది. ఏర్పేడులో మూడు రోడ్ల కూడలి నుంచి వెంకటగిరి రోడ్డు వైపు గుంతలమయంగా మారింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గుంతల్లో నీరు నిలిచిపోయింది. పలు గ్రామాల నుంచి వివిధ పనులకు ఏర్పేడుకు ప్రజలు వెళుతుంటారు. కాలినడకన వెళ్లే ప్రజలు, ఆటోలు, ద్విచక్రవాహన దారులు గుంతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత మూడు నెలలుగా గుంతలకు మరమ్మతులు చేపట్టాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు రోడ్డుకు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



కప్‌ను అందుకుంటున్న గరుడ వింగ్స్ టీం సభ్యులు

నారాయణవనం: యువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే శారీరకంగా, మానసికంగానూ ఉత్తేజంగా ఉండవచ్చని పలువురు పేర్కొన్నారు. మండల కేంద్రమైన నారాయణవనంలో ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరిగింది. ఎనిమిది క్రికెట్ టీంలు పాల్గొన్న టోర్నమెంట్‌లో మొదటి రెండు స్థానాల్లో గరుడ వింగ్స్, కేఎఫ్ గైస్ టీంలు నిలిచారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో టోర్నమెంట్ స్పాన్సర్లు క్రీడాకారులకు కప్‌లు అందజేశారు. స్నేహపూరిత వాతావరణంలో యువకులకు ఏటా టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఉచిత ఇసుక ఎక్కడ ?



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

గూడూరు రూరల్ : కూటమి ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తున్నామని చెబుతోందని, ఇసుక స్టాక్ పాయింట్ల వద్దకు వెళితే తడిసి మోపెడు అవుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి దుయ్యబట్టారు. పట్టణంలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఆదివారం సీపీఐ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలు, మధ్య తరగతి కుటుంబాల వారు ఇళ్లు నిర్మించుకునే క్రమంలో ఇసుక ఉచితంగా దొరుకుతుందని స్టాక్ పాయింట్ల వద్దకు వెళితే అక్కడ ట్రాక్టర్ ఇసుక రూ.6వేలు పడుతోందని తెలిపారు. ఉచితంగా ఎలా ఇస్తారో కూటమి ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. గతానికి, ఇప్పటికి తేడా లేదన్నారు. ఇలా అయితే భవన నిర్మాణ రంగం పూర్తిగా దెబ్బతింటుందని, పనులు లేక కూలీలు ఇబ్బందులు పడతారని వివరించారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి ఉచితంగా ఇసుక ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా గత ఏడాది కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. అభ్యుదయ వేదిక జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ మూఢ నమ్మకాలను పారదోలేలా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శశి, కాలేషా, సీవీఆర్ కుమార్, ఎంబేటి చంద్రయ్య, నారాయణ, రమేష్, భాస్కర్, క్రిష్ణయ్య, శేషయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కుక్కంబాకం గ్రామంలోని గ్రామస్తులకు ఆదివారం గ్రామ కార్యదర్శి శివకుమార్, వైద్య సిబ్బందితో కలసి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామంలోని వీధుల్లో స్టాప్ డయేరియాపై ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని డ్రైనేజీ కాలువల్లోని మురుగు నీటిని తొలగించి, బ్లీచింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషితమైన నీటిని, ఆహారాన్ని తీసుకోవడంతో టైఫాయిడ్, డయేరియా వ్యాధులు వస్తాయని తెలిపారు. దోమకాటుతో మలేరియా, వైరల్ ఫీవర్, డెంగీ, చికెన్ గున్యా వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే కొంత వరకు వ్యాధులను అరికట్టవచ్చునని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఢిల్లీ, వైద్యసిబ్బంది, పాల్గొన్నారు.



దోమల నివారణకు ఆయిల్ పోస్తున్న సర్పంచ్ ఢిల్లీ



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది